# పుల్వామా వద్ద టెర్రరిస్టు దాడిని ఖండించండి

**జమ్ముకాశ్మీర్** రాష్ట్రం–పుల్వామా లెథాపొరా వద్ద టెర్రరిస్టుల దాడిలో 44 మంది సిఆర్‌పిఎఫ్ సైనికులు ప్రాణాలు కోల్పోవటంపట్ల సిపిఐ(ఎం–ఎల్) తన విచారాన్ని, దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తోంది. విషాదకర ఘటనలో విలువైన జీవితాలు కోల్పోవటం బాధాకరమైనది. జైష్–ఎ–ముహమ్మద్ (జెఇఎమ్) అనే సంస్థ ఈ చర్య తామే జరిపామని ప్రకటించుకుంది. సిపిఐ(ఎం–ఎల్)ఈ దాడిని ఖండిస్తూ, ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలుపుతోంది.

ఈ దాడిని ఖండిస్తూనే, మరణించిన వారి హత్యలకు ప్రతీకారం పేరుతో బాధ్యతారహితంగా హింసను, యుద్ధాన్ని శాశ్వతీకరించరాదని గట్టిగా నొక్కిచెప్పటం కూడా ప్రాముఖ్యత కలిగిన విషయం. కాశ్మీరి ప్రజల వ్యతిరేక ఉన్మాదాన్ని జాతీయ దురహంకారాన్ని, ముస్లిము వ్యతిరేక ద్వేషాన్ని దేశప్రజల మధ్య రెచ్చగొడ్తున్న పాలకపార్టీయొక్క ప్రయత్నాలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం.

కాశ్మీర్‌పట్ల భారత ప్రభుత్వ తప్పుడు విధానాల దుష్ఫలితమే ప్రస్తుత దాడి అనేది స్పష్టం. కాశ్మీర్‌నుండి మిలిటెంట్లను తుడిచి పెడతామనే ప్రకటనలు దానిలో భాగమే. రాజకీయ పరిష్కార ప్రయత్నాల జోలికి ఏమాత్రం పోకుండా, ఇన్ని దశాబ్దాల కాలంగా భారత ప్రభుత్వం అమలుచేస్తున్న నిర్బంధ విధానమే మిలిటెంట్ల ఉనికి, పెరుగుదలకు అనుకూలమైన పరిస్థితులను సృష్టించాయి. కాశ్మీర్ లోయలో అత్యంత తీవ్ర నిర్బంధం- ప్రత్యేకించి 2016 నుండి–అమలుచేయటం, స్త్రీపురుషులను, చిన్నపిల్లలను హత్యగావించటం, మాయం చేయటం, పోలీసు కాల్పులలో చంపేయటం, పెల్లెట్‌గాయాల పాల్జేయటం, భారీసోదాలు, పెద్దస్థాయిలో కేసులు బనా యించటం, మానవ హక్కులను ఘోరంగా ఉల్లంఘించటం వంటి చర్యలన్నీ యువజనులను రాజ్యానికి వ్యతిరేకంగా ఆయుధం పట్టుకో వటానికి ప్రేరేపిస్తాయి.

కాశ్మీర్ సమస్య రాజకీయ పరిష్కారానికి భారతప్రభుత్వం చర్చలు జరపటానికి మార్గాలను తెరవాలి. వాటిలో ఒక అడుగు ఏమంటే ఏఎఫ్‌ఎస్‌పిఏ చట్టాన్ని ఉపసంహరించుకోవటం. కాశ్మీర్ ప్రజలు తమ భవితవ్యాన్ని నిర్ణయించు కోవటానికి వీలుగా ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ) నిర్వహించేందుకు హామీనివ్వటం, కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును మనం గౌరవించాలి.

oooo